క్లుప్తంగా

సెలవుల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

దుగ్గిరాల: వృత్తి విద్య ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ జ్ఞానం, సృజనాత్మక ఆలోచనలతో పాటు సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని హెచ్.ఎం బి.వి.కృష్ణారావు ఆకాంక్షించారు. గురువారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. హెచ్ఎం బి.వి. కృష్ణారావు మాట్లాడుతూ ఈ తరగతులను వినియోగించుకోవాలని సూచించారు. టైలరింగ్ ట్రైనింగ్ అనుమతితో 10 రోజులు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి అన్నకూటోత్సవం



దుగ్గిరాల :మండల కేంద్రంలో పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం వివిధ రకాల ఆహార పదార్థాలు, పండ్లతో స్వామి రూపంలో అన్నకూటోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

‘అప్రోచ్’ అవస్థలు

దుగ్గిరాల: అప్రోచ్ రోడ్డుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మంచికలపూడి నుంచి కంఠంరాజుకొండూరు వెళ్లే డీఆర్‌బీసీ వంతెన నిర్మాణంలో ఉండగా పక్కగా అప్రోచ్ రోడ్డు వేశారు. ఇది గత వర్షాలకు బాగా దెబ్బతినంతో వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి వెళ్తున్నాయి. గురువారం సాయంత్రం ఇక్కడ ఓ కళాశాల బస్సు ఇరుక్కు పోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. గతంలో వర్షాలు పడినప్పుడు ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. దీని ఎత్తుపెంచి విస్తరిస్తే ఇబ్బందులు వచ్చేవి కావని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యాన కుంచనపల్లిలోని అరవింద పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. వర్సిటీ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అంటే కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు దారిని చూపే శిల్పి అని కొనియాడారు. డాక్టర్ వెంకటేశ్వరకుమార్ సమయ నిర్వహణపై దృష్టి అంశంపై మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని గణనీయమైనది, పాఠాలు చెప్పడం మాత్రమే కాకుండా పాఠ్య ప్రణాళికలుసిద్ధం చేయడం, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల మనోభావాలపై దృష్టి పెట్టడం వంటి అనేక పనులు ఉపాధ్యాయులపై బాధ్యతగా ఉంటాయన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వి.ఎ.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో ఉపాధ్యాయులు శక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ బోధన ఎంత ముఖ్యమో, ఇంటిలో కుటుంబానికి సమయం కేటాయించడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ బి.కిషోర్ బాబు, వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నరసింహస్వామి ఆలయంలో విజయలక్ష్మీదేవి



శివాలయంలో ధనలక్ష్మి అలంకారంలో..



కనకదుర్గ ఆలయంలో..



తాడేపల్లిలో కాత్యాయనీ అలంకారంలో

జగజ్జనని దర్శనం.. జన్మ ధన్యం

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



ధనలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



విద్యుద్దీపాల వెలుగులో నృసింహుని ఆలయం



కుంకుమ పూజలు

మంగళగిరి టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నయన మనోహరంగా, అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గురువారం జగన్మాత విభిన్న రూపాల్లో భక్తుల పూజలందుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. శక్తి స్వరూపిణిని కనులారా దర్శించుకుని పులకించిపోయారు. మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం రాజ్యలక్ష్మి అమ్మవారిని శ్రీ విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో

పాత మంగళగిరి దుర్గ నగర్ బైపాస్ వెంబడి ఉన్న శ్రీ కనకదుర్గ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారు గురువారం శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. తాడేపల్లి భజన సమాజం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నిర్వాహకులు ఇంటూరి దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయంలో..

శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు గురువారం శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. ఈఓ గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాళీమాత ఆలయంలో..

మంగళగిరి పట్టణ పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్ రాజీవ్ గృహకల్ప రోడ్డు వెంబడి ఉన్న శ్రీ కాళీమాత ఆలయంలో అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మేడికొండూరు: జోకిపర్రులో అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున క్షీరాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. జోకిపర్రు పోలేరమ్మ ఆలయ ధర్మకర్త మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యులు కందులు సిద్దయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని శ్రీ గంగా బాలత్రిపుర సుందరీదేవి రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు కాత్యాయనీ అలంకారంలో, ఉండవల్లి రెడ్ల రామమందిరంలో కాత్యాయనీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉండవల్లిలోని సాయంత్రం ఏర్పాటు చేసిన కుంకుమ పూజ, బాలపూజల్లో మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై గురువారం ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరు గ్రామంలో వేంచేసిన శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో గురువారం భద్రకాళీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈఓ కె. సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- అన్యాయానికి గురైన కార్యకర్తల కోసమే డిజిటల్ బుక్
- అధైర్య పడొద్దు
- పాలకుల మోసాలను ఎండగట్టండి
- మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల ముఖ్య నాయకుల సమావేశంలో తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డైమండ్ బాబు



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు (డైమండ్)

తాడికొండ: కష్ట కాలంలో పని చేసిన నాయకులు, కార్యకర్తలకు అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్) అన్నారు. గురువారం గుంటూరు మల్లికార్జునపేటలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అనేక రకాల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వారందరికీ అండగా నిలవడానికి డిజిటల్ బుక్‌ను రూపొందించామని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారని ఎవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు.

కూటమి ఆటవిక పాలన

కూటమి నాయకులు రాష్ట్రంలో ప్రజా సమస్యలు, హామీలను గాలికొదిలి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు దిగడం, తప్పుడు కేసులు బనాయించడం పరిపాటిగా మారి ఆటవిక పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరికీ తగిన జవాబు ఇచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పార్టీ బలోపేతంలో భాగంగా అనుబంధ విభాగాల నియామకం వేగవంతంగా చేస్తున్నామని, పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ అందులో స్థానం కల్పిస్తామని చెప్పారు.. ఇప్పటికే జిల్లా కమిటీల నియామకాలు, మండల అనుబంధ విభాగాల నియామకాలు దాదాపు పూర్తయ్యాయని, మండల కమిటీలు, గ్రామ కమిటీల నియామకాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అత్యంత ప్రాధాన్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాలకు చెందిన నాయకులకు ఐడీ కార్డులు ఇవ్వడం, వారికి భవిష్యత్తులో అత్యంత ప్రాధాన్యమిస్తామన్నారు. పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తను పరిగణనలోకి తీసుకొని నియామకాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముప్పాళ్ళ మనోహర్, 4 మండలాల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, తాళ్ళూరి వంశీ, వంగా పోలారెడ్డి, మైనేని నాగమల్లేశ్వరరావు, చుండు వెంకటరెడ్డి, వివిధ అనుబంధ విభాగాల తాడికొండ మండల అధ్యక్షులు గుంటి రఘువరన్, షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, బొంతా శ్రీకాంత్, తుళ్ళూరు మండల అనుబంధ అధ్యక్షులు కొలేటి అనీల్, బెజ్జం రాంబాబు, మేడికొండూరు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు మేరిగ శివ నాగేంద్రం, బిళ్ళా లూర్దు రాజు, ఫిరంగిపురం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు మస్తాన్‌వలి, మద్రి గోపి, బోయినపల్లి సాల్మన్ రాజు, పెరికల చిన్నా, మాయకుంట్ల రాయప్ప, కుంభాల సతీష్, జక్కుల రవి, కుంభా తిరుపతయ్య, యంద్రెడ్డి హేమలతారెడ్డి, జమీల్, శ్రీనివాసరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, బాలిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజాన్ని అందించాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా



పుష్కర ఘాట్లను శుభ్రం చేస్తున్న దృశ్యం



పరిసరాలు శుభ్రం చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు, సిబ్బంది

మంగళగిరి టౌన్ / తాడేపల్లి రూరల్: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర సమాజాన్ని అందించగలమని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా స్పష్టం చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో ఏక్‌దిన్.. ఏక్ గంట... ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత పనులను గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకాశం బ్యారేజ్ సమీపంలోని సీతానగరం పుష్కర ఘాట్లలో అధికారులతో కలసి చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఒక్కరు స్వచ్ఛతపై అవగాహన కలిగి, వారంలో ఒక్కరోజు, ఒక్క గంట అయినా ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధతో శ్రమదానం చేయాలని కోరారు. ప్రతిరోజూ ఇంటివద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అందరూ శ్రమదానం చేయాలన్నారు. పుష్కర ఘాట్ వద్ద మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. మంగళగిరి నగర పరిధిలోని పలు వార్డుల్లో సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు మొక్కలు నాటి, ప్లాస్టిక్ నిషేధంపై, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి, క్లీన్లీనెస్ డ్రైవ్, స్వచ్ఛ ఉత్సవ్ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయసిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, పారిశుద్ధ్య సిబ్బంది, మెప్మా సిబ్బంది, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు అన్నారు. మండలంలోని రేపూడిలో గురువారం స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు, ఈవోపీఆర్డీలు తాగునీటి పథకం ట్యాంకు వద్ద ఉన్న పరిసరాలు, చెత్తను తొలగించి, శుభ్రం చేశారు. చేతులు శుభ్రంగా ఉంచుకొని ఆహారం తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాతలాకుల వద్ద శ్రమదానం

దుగ్గిరాల: పాత లాకుల వద్ద అధికారులు, నాయకులు, ప్రజలు శ్రమదానం చేశారు. గురువారం దుగ్గిరాల మండల కేంద్రంలో స్వచ్ఛతాహీ సేవాపక్షోత్సవం సందర్భంగా గురువారం ఏక్ దిన్ ఏక్ ఘంట ఏక్ సాత్ కార్యక్రమంలో డీఎల్పీఓ స్వరూపారాణి, ఈఓ వివేకానంద పంచాయతీ సిబ్బంది దుగ్గిరాల పాత లాకులు సమీపంలోని పార్కులో శుభ్రం చేశారు.

పని గంటల పెంపును విరమించుకోండి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

తాడేపల్లి రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన 13 గంటల పని విధానాన్ని విరమించుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ మోటూరు ఉదయం రైతుల రాష్ట్ర కార్యాలయంలో విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13 గంటల పని విధానాన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఏకపక్షంగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడమే కాకుండా కార్మికుల 8 గంటల పని విధానానికి తూట్లు పొడవడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం.. కార్మికుల విషయంలో పాలకులు చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తోందన్నారు. మహిళలు ఇప్పటికే ఇంటి పని చేస్తూ, కుటుంబ పోషణ కోసం బయట పని చేస్తున్నారన్నారు. అదనపు పని భారాలను మహిళా కార్మికులపై వేయడానికి అసెంబ్లీలో తీర్మానించడం కార్మికులకు, మహిళా కార్మికులకు తీరని అన్యాయమని పేర్కొన్నారు. అవసరమైతే మహిళా శ్రామిక వర్గాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 13,14,15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల్లో 13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీదేవి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, అలివేలు, పూర్ణ, రమణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డి. రమాదేవి

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



అనారోగ్య సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ మానస మంజరి



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యానీగ్రేస్



చింతలపూడి ప్రియదర్శిని కళాశాలలో జరిగిన వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

తాడేపల్లి రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆనందంగా ఉంటుందని డాక్టర్ మానస మంజరి అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రకాష్ నగర్ డ్రైవర్స్‌కాలనీలోని యూపీహెచ్‌సీలో స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రధానమంత్రి స్వస్తనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. క్యాంప్‌లో చిన్నపిల్లల వైద్యులు, చెవిముక్కు గొంతు వైద్యులు, చర్మవ్యాధుల నిపుణులు, కంటి వైద్యులు, స్త్రీల వైద్యులు, దంతవైద్యులు తదితరులు వైద్యసేవలను అందజేశారన్నారు. సుమారు 300 మందికి పైగా రోగులను పరీక్షించి, అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీమన్నారాయణ, సుదీర్, శంకరరావు, శ్రీలక్ష్మి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం: యర్రగుంట్లపాడులో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యాన స్వస్తనారీ-సశక్త్‌పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు వైద్యురాలు యానీగ్రేస్ వైద్యపరీక్షలు చేశారు. మహిళలకు పోషకాహారం తయారు చేసుకునే విధానం తెలిపేలా స్టాల్ ఏర్పాటు చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై దృశ్యమాలిక నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.కేశవరావు, కార్యదర్శి హర్షవర్ధన్, సీహెచ్‌వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

దుగ్గిరాల: ప్రజలందరూ విధిగా ప్రభుత్వం అందించే ఆరోగ్య సలహాలను, సూచనలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ ఎ.శ్రీవల్లి అన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం దుగ్గిరాల మండలం చింతలపూడి ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించిన శిబిరాన్ని శ్రీవల్లి ప్రారంభించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఈమని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టరు ఎ.శ్రీవల్లి మాట్లాడుతూ అన్ని రకాల సేవలు ఒకేచోట అందుతున్నాయని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, చిన్న పిల్లలకు టీకాలు, వైద్య అవగాహన, రక్తహీనత, క్షయ గుర్తింపు పరీక్షలు, బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు, గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. రక్తదానం, అవయవదానం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సుమారు 100 మందికి పైగా సేవలు పొందారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వైద్యశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్సతో తొలగించిన ట్రాకియా గడ్డ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో అరుదైన పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్‌కు శస్త్రచికిత్సను గురువారం నిర్వహించినట్లు సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ వి.ధర్మేంద్రకుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ అత్యంత క్లిష్టమైన థైరాయిడ్ క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో ఇది ఒకటన్నారు. 52 ఏళ్ల మహిళకు శ్వాసనాళం (ట్రాకియా) వరకు వ్యాపించిన అరుదైన, సంక్లిష్టమైన పాపిల్లరీ థైరాయిడ్ కార్సినోమా కేసును శస్త్రచికిత్సతో విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఇది చాలా అరుదుగా నేరుగా శ్వాసనాళంలోకి వ్యాపించే రకమని, పీఈటీ-సీటీ స్కాన్‌లో శరీరంలోని ఇతర భాగాలకు వ్యాప్తి లేనందున శస్త్రచికిత్స ఉత్తమమని తెలిపారు. ఆస్పత్రి ఆంకాలజీ, పాథాలజీ, రేడియాలజీ, సర్జరీ నిపుణులు ట్యూమర్ పరీక్ష అనంతరం శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. రోగికి థైరాయిడ్ గ్రంధిని తొలగించడం, మధ్య మెడ లింఫ్ నోడ్ల తొలగింపు, తిరిగి కుట్టివేసే (ప్రైమరీ అనాస్టమోసిస్) వంటి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించామని పేర్కొన్నారు.